క్లుప్తంగా

'సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలు'

జూలూరుపాడు: అర్హులైన రైతులందరికీ రైతు భరోసా ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలు అయ్యాయని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మార్చి 31వ తేదీలోగా రైతులందరి బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా జమ చేస్తామన్న ప్రగల్భాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసి కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

హర్షం..

పాల్వంచ: బంజారా జాతి బాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చడానికి ఇటీవల తెలంగాణ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడం హర్షణీయం అని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవీలాల్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జూలూరుపాడు: మాచినేనిపేటతండా గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మాచినేనిపేటతండా గ్రామం వద్ద ఛత్తీస్‌గఢ్ వెళ్లే లారీ రోడ్డు పక్కన నిలిపి ఉంది. ఈ సమయంలో జూలూరుపాడు నుంచి వస్తున్న ఓ వ్యక్తి బైక్‌పై కొత్తగూడెం వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. అదే సమయానికి అటుగా వెళుతున్న బీఆర్ఎస్ నాయకుడు లకావత్ గిరిబాబు గమనించి స్థానికుల సాయంతో గిరిబాబును ఆస్పత్రికి తరలించాడు. గాయపడిన వ్యక్తి జూలూరుపాడుకు చెందిన వ్యక్తి అని తెలిసింది.

నల్ల రిబ్బన్లతో ముస్లింల నిరసన



నిరసన తెలియజేస్తున్న ముస్లింలు

టేకులపల్లి: వక్ఫ్ బోర్డు విషయంలో కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని వ్యతిరేకిస్తూ ముస్లింలు నిరసన తెలియజేశారు. సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు నల్ల రిబ్బన్ ధరించి నమాజ్‌కు హాజరై నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు విషయంలో కేంద్రం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముస్లింలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు.

శేష జీవితం ప్రశాంతంగా గడపాలి



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: ఉద్యోగ విరమణ చెందిన పోలీసు ఉద్యోగులు తమ శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్సై సూరిశెట్టి శ్రీనివాసరావు, అశ్వారావుపేట ఏఎస్సై రెహమాన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వజ్జ రామయ్యలను సన్మానించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు వితరణ



దుస్తులు అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

పాల్వంచ: ఉగాది పురస్కరించుకుని వాసవీ క్లబ్, వనితా క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సంకా సర్వేశ్వరరావు సోమవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సెక్రటరీ దారా జయశంకర్, నాగమల్ల కోటేశ్వరరావు, ప్రతినిధులు పెండ్యాల రోజాలక్ష్మి, దారా నరసింహారావు, కొప్పరపు వీరబాబు, వంకదారు ఇందిరా, గుబ్బ దుర్గ, వంకదారు రామలింగేశ్వరరావు, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఈద్ ముబారక్

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రత్యేక పార్థనలు • ఖురాన్ బోధించిన మతపెద్దలు



కొత్తగూడెంటౌన్: రైటర్‌బస్తీలోని బోడగుట్ట వద్ద ఈద్గాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని



ఇల్లెందురూరల్: ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



కొత్తగూడెంటౌన్: రామవరంలోని ఇంక్లైన్ వద్ద ఈద్గాలో ముస్లింల సామూహిక ప్రార్థనలు

ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. తరలివచ్చిన ముస్లింలతో ఈద్గాలు కళకళలాడాయి. నెల రోజులు ఉపవాస దీక్షలు ఆచరించి సోమవారం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థన చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మతగురువులు ఖురాన్ పవిత్ర గ్రంథంలోని ప్రవచనాలను చదివి వినిపించారు. ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్ అని, సర్వమత అభ్యున్నతికి అందరూ పాటుపడాలన్నారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన సన్మార్గంలో నడవాలని సూచించారు. ముస్లింలు ఇచ్చిన విందుకు పలు పార్టీల నాయకులు హాజరై మత సామరస్యాన్ని చాటుకున్నారు. ముస్లింలు ఇరుగుపొరుగు వారికి, స్నేహితులకు సేమ్యాలను పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: ఆజాద్‌నగర్ ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



ఇల్లెందు: ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగల రాజేందర్



పాల్వంచ: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు



జూలూరుపాడు: ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న ఎస్సై రవి



కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్‌లో ప్రార్థనలకు వస్తున్న ముస్లింలు





ఇల్లెందు: ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చుంచుపల్లి: పెనగడపలో రంజాన్ వేడుకకు హాజరైన ముస్లింలు





కొత్తగూడెంటౌన్: రామవరం వద్ద ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, చిన్నారులు



జూలూరుపాడు ప్రార్థన చేస్తున్న ముస్లింలు



కొత్తగూడెంటౌన్: శుభాకాంక్షలు చెబుతున్న చిన్నారులు



ఇల్లెందు: ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న ముస్లింలు



టేకులపల్లిలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు



కొత్తగూడెంటౌన్: రైటర్‌బస్తీలోని బోడగుట్ట వద్ద ఈద్గాలో...



కొత్తగూడెంలో సామూహిక ప్రార్థనలు



పాల్వంచ: శుభాకాంక్షలు చెబుతున్న కొత్వాల శ్రీనివాసరావు



పాల్వంచరూరల్: కిన్నెరసానిలోని మజీద్‌లో ప్రార్థనలు

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి..



ఇల్లెందురూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 8న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు రొంపేడు గ్రామంలో ధర్నా ప్రచార పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ జాతి హననానికి కేంద్ర ప్రభుత్వం ఎడతెగని హత్యాకాండకు తెగబడుతోందని విమర్శించారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వందలాది మంది చేయబడ్డారని పేర్కొన్నారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలే లక్ష్యంగా ఆదివాసీ జాతిని తుదముట్టించడమే పనిగా కేంద్ర ప్రభుత్వం అడవిలో మారణకాండ సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అన్నివర్గాల ప్రజలు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో గొని నాగేశ్వరరావు, తుపాకుల నాగేశరరావు, ముక్తి సత్యం, సారంగపాణి, రాసుద్దీన్, డి.ప్రసాద్ పాల్గొన్నారు.

టేకులపల్లి: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఏప్రిల్ 8న హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లిలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జల్ జంగిల్.. జమీన్ హమారా.. అంటూ అడవిని, అడవిలోని సహజ సంపదను రక్షించుకునేందుకు సాగిస్తున్న ఆదివాసీల వీరోచిత పోరాటాలకు అండగా ఉంటామన్నారు. అటవీ ప్రాంతాల్లో చట్టాల విరుద్ధంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఆదివాసీల కోసం పోరాడే వారిని, ప్రశ్నించే వారిని నిర్బంధంతో ఎన్‌కౌంటర్లు చేస్తూ హతమారుస్తున్నారని విమర్శించారు. ఆదివాసీల హక్కు అయిన ఐదో షెడ్యూల్ లేకుండా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ, అంబానీ కంపెనీలకు పర్మిషన్ ఇచ్చేందుకు గ్రామాలపై దాడులు చేస్తున్న వారిపై ప్రజాస్వామికవాదులు పోరాడాలని పిలుపునిచ్చారు. భూక్యా హర్ష, నోముల భానుచందర్, భూక్యా నర్సింగ్, ఎట్టి నరసింహారావు, రామచందర్, భీక్యా, పడిత్యా, మంచా, రవి, మనోజ్, సతీష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ పోస్టుల నియామకం..?



సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో రెండు హయ్యర్ (చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్) కాంట్రాక్ట్ పోస్టుల నియామకానికి మార్చి మొదటి వారంలో యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ నుంచి ఈనెల 25న... రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఏ ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో కాంట్రాక్ట్ బేస్ మీద ఉద్యోగులను నియమించి ఉంటే.. వారిని వెంటనే తొలగించాలని ఉత్తర్వులు వచ్చాయి. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం ఆ రెండు కాంట్రాక్ట్ పోస్టులను నియమించాలా.. వద్దా అనే సందిగ్ధంలో పడినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇప్పటికే సింగరేణిలో కొంతమంది ఉద్యోగ విరమణ పొంది కాంట్రాక్ట్ బేస్ మీద విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరిని తొలగిస్తారా.. కొనసాగిస్తారా వేచి చూడాలి.

అమలుకాని రంజాన్ తోఫా పథకం

కొత్తగూడెంఅర్బన్: ఈ ఏడాది చివరలో బీహార్ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం ఓట్లను దండుకోవాలనే కుటిల లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ 'సౌగాత్ ఏ మోదీ' పేరుతో 32 లక్షల మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫాలను అందించే పథకానికి శ్రీకారం చుట్టారు కానీ, ఎక్కడా పంపిణీ జరిగినట్లు లేదని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వానికి రంజాన్ పండుగ కానరాలేదని పేర్కొన్నారు. ముస్లింలను విద్య, ఆర్థిక, సామాజిక పరంగా తొక్కిపెట్టడానికి 2022 నుంచి ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, మెరిట్ కమ్ మీన్స్ బేస్డ్ ఉపకార వేతనాలను రద్దు చేశారని తెలిపారు. దీంతో పాటు అబుల్ కలాం ఫెలోషిప్‌ను కూడా రద్దు చేశారని, ఎస్సీ, ఎస్టీల కన్నా, ముస్లింల స్థితిగతులు అధ్వానంగా ఉన్నాయని జాతీయ స్థాయిలో పలు కమిషన్లు నివేదికలలో పేర్కొన్నప్పటికీ, వాటని పెడచెవిన పెట్టి ముస్లింలను అణగతొక్కే ఆలోచనలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆరోపించారు. నిజంగా ముస్లింలపై ప్రేమ ఉంటే విద్య, ఉద్యోగ రంగాల్లో ముస్లింలకు తగు ప్రాతినిధ్యం కల్పించే విధంగా చట్టాలు అమలు చేయాలని, రంజాన్ తోఫాలతో ముస్లింల స్థితిగతులు మారవని, అయిన ఎక్కడా పంపిణీ చేయకపోవడం గమనార్హం అని పేర్కొన్నారు.

ప్రవీణ్ కుటుంబానికి న్యాయం జరగాలి



చర్చిలో మాట్లాడుతున్న జాన్‌రాజ్

టేకులపల్లి: ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో అనుమానస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం జరగాలని టేకులపల్లి మండల పాస్టర్ ఫెలోషిప్ కమిటీ ప్రెసిడెంట్ పాస్టర్ బి.జాన్‌రాజ్, జనరల్ సెక్రెటరీ పాస్టర్ టీ.బోయాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బికాలనీ తండాలో పెంతెకోస్తూ ప్రార్థనా మందిరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలు క్రైస్తవులు ఐక్యత వర్ధిల్లాలన్నారు. హైదరాబాద్ నుంచి బైక్‌పై రాజమండ్రి వైపు వెళ్తున్న పాస్టర్ ప్రవీణ్ కుమార్ మరణం బాధాకరమని, ఆయన మరణంపై పలు అనుమానాలు ఉన్నట్లు చెప్పారు. ప్రవీణ్ కుటుంబానికి ఆయన లేని లోటు పూడ్చలేనిదని ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేసే వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కమిటీ పాస్టర్స్ రాజు రామ్ చందర్, కోశాధికారి హనోకు, కార్యవర్గ సభ్యులు దేవరాజ్, సభ్యులు పేతురు, స్టీవెన్, ప్రభుదాస్, రాజ్ కుమార్, దేవదాస్, ఆనంద్, సిస్టర్స్, తారాబాయి, సోనెమ్మ పాల్గొన్నారు.

భూముల వేలం విరమించుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని టీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు జేసీబీని అడ్డుకుంటే వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం హేయకరమన్నారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పెట్టుబడిదారులకు అమ్మకానికి పెట్టడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

సింగరేణి(కొత్తగూడెం): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో విద్యార్థుల అరెస్టులను వ్యతిరేకిస్తూ సోమవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్యా అభిమన్యు, ఉపాధ్యక్షుడు రామ్‌చరణ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం ప్రజాస్వామ్యం లేకుండా చేసిందని, నియంతృత్వాన్ని, అహంకారాన్ని ప్రదర్శించిందని ప్రచారం చేసిన ముఖ్యమంత్రి ఇప్పుడు అంతకంటే ఎక్కువగా తెలంగాణ రాష్ట్రంలో నిర్బంధాన్ని, అహంకారం ప్రదర్శిస్తున్నారన్నారని విమర్శించారు. యూనివర్శిటికి చెందిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు వేలం వేయాలనే నిర్ణయం సరికాదన్నారు. దీన్ని అడ్డుకుంటూ పది రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న 60 మంది విద్యార్థులను అరెస్ట్ చేయటం అప్రజాస్వామిక చర్య అని వారిని వెంటనే విడుదల చేయాలని, ఆభూముల జోలికి వెళ్లరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, తనుజ్, బాలకృష్ణ, వేణు, దిలీప్, వంశీ, రవి, సుమంత్ పాల్గొన్నారు.



సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగితం పూల ఆహ్లాదం..



హరితహారంలో భాగంగా సుజాతనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కలు ఎర్రపూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రధాన రహదారిపై డివైడర్ మధ్యలో కడియం నర్సరీ నుంచి తెచ్చిన కాగితపు పూల మొక్కలను రెండేళ్ల క్రితం నాటారు. ప్రస్తుతం ఇవి ఎరుపు రంగులో విరగపూయడంతో వచ్చిపోయేవారికి కొత్త అనుభూతిని పంచుతున్నాయి. పూల సౌందర్యం ముంత్రముగ్ధులను చేస్తోంది. – సుజాతనగర్

విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

జూలూరుపాడు: రైతులను మోసం చేస్తున్న మొక్కజొన్న విత్తన కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్ర నరేంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినోభానగర్ గ్రామానికి చెందిన జర్పల కృష్ణ అనే రైతు మొక్కజొన్న కంకులు తిని మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నరేంద్రకుమార్ సోమవారం పరామర్శించి, ఓదార్చారు. మాట్లాడుతూ.. రైతు కృష్ణ మృతికి విత్తన కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించి, బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారు. మండలంలోని రైతులు అధిక విస్తీర్ణంలో ఆడ, మగ మొక్కజొన్న పంట సాగు చేసినట్లు చెప్పారు. అధిక రసాయనాలు, పురుగు మందులు వాడి తక్కువ కాలవ్యవధిలో అత్యధిక పంట దిగుబడి వస్తుందని విత్తన కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. విత్తన కంపెనీ బాధ్యులు, దళారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యాసా రోశయ్య, యల్లంకి మధు, చెరుకుమల్లి రాజేశ్వరరావు, గుండెపిన్ని పుల్లారావు, సాయిన్ని నరసింహారావు, వీరయ్య పాల్గొన్నారు.



బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నరేంద్రకుమార్ తదితరులు